"పతితులార! భ్రష్టులార!
బాధాసర్ప దష్టులార"

# సంఘానికి బహిష్కృతులు

(కథానిక)

చలి - బాకుల్లా పొడుస్తున్న చలి.

మంచు - వర్షంలా కురుస్తున్న మంచు.

రాత్రి-రాత్రికాని రాత్రి-వేగుజాము - కన్ను పొడుచుకున్నా కనిపించటం లేదు బయట - బయటనే కాదు లోపల కూడా చీకటే - కటిక చీకటి.

పక్కలో వున్న పిల్లవాడు కెవ్వునకేక వేశాడు. అదరి పడి లేచింది తల్లి. ఆ తల్లి హృదయం కొట్టుకుంటోంది-పిల్లవాడు ఏడుస్తున్నాడు - తల్లి సముదాయిస్తోంది - కాని నిలవటంలేదు-చేతులో బిడ్డకు కాగిపోతున్నాడు - జ్వరం-పాడుజ్వరం అంతూ పొంతూ - లేదు. నాలుగు రోజుల నుండీ వేధిస్తోంది. మరెవరూ సాయంవున్నట్లుగా కూడా లేదు వారికి. ఒక్కర్తే తంటాలు పడుతోంది. నాలుగు రోజులనుండి కూడా, బిడ్డకు జబ్బుగా వుందని తెలిసి కూడా ఎవరూ వూరి వారు తిరిగి చూడలేదు ఆ యింటివైపు. మందు కోసం వైద్యుణ్ణి పిలిచినా ఏదో మాత్ర చేతిలో పెట్టి కాగితం రాసిచ్చాడు పట్నంలో కొనుక్కొచ్చుకో మని. ఆసమయంలో ఆ డాక్టరునే ప్రార్థించింది:

"బాబూ, బాబూ, కాస్త సాయంచేసిపెట్టండి మీకు పుణ్యం వుంటుంది" అని అన్న దామె.

"నాకు పుణ్యమవుసరం లేదు పాపమవుసరం లేదు. వున్నదేదో వుంది, ఇంకెందుకులే మాటలు తల్లీ, మా తల్లిగా ఏదో నువ్వే అవస్థపడు" అన్నాడు వైద్యుడు అసహ్యంగా.

"డాక్టరు బాబూ! మీకాళ్లకు మొక్కుకుంటాను. కాస్త తెప్పించండి బాబూ, ఆ భగవంతుడు చల్లగా చూస్తే బిడ్డకు నయమయ్యాక ఏదో..."అంటుండగానే డాక్టరు అందుకుని "సరే, ఇంకేం ఆ యిచ్చేదేదో ఆ భగవంతుడికే యివ్వలేక పోయావ్, మధ్య నన్నెందుకు పిలిచావ్!" అన్నాడు.

ఆమె ఆశ్చర్యచకితురాలై "అదేమిటి బాబుగారూ, అలా కోపగించుకుంటారు! నేను మీకేం కష్టం కలిగించాను చెప్పండి!" అంటూ వుంటే, "నాకదేం తెలియదమ్మా, నీ యిష్టం, తెచ్చుకుంటేతెచ్చుకో లేకపోతేమానుకో నాకేం అవుసరంలేదు" అంటూ బయటకువెళ్లిపోయాడు ఆ పల్లెటూరి డాక్టరు.

ఉదయం అనగా డాక్టరు వెళ్లిపోయాడు. ఆమె ఆమాత్ర మాత్రం బిడ్డకు యిచ్చింది. కాని దానివల్ల పనేంకాలేదు. బిడ్డ పొద్దుక్షించీ మూసిన కన్ను తెరవలేదు - జ్వరం బాగా ముసురుకుంటుంది-ఏం చేయటానికీ తోచలేదామెకు.

అలాగే పొద్దుగూకింది, ఆ పూటకు మందు లేదు బిడ్డకు. ఏం జేసేట్టు—డాక్టర్నడిగితే యేం లాభం లేదు మందు తెప్పించుకో మన్నాడు. పగలల్లా తంటాలు పడినా ఎవరూ దొరకలా బస్తీ కెళ్ళటానికి - ఓ అణాడబ్బు లిస్తానన్నా తలాయించారు కొందరు — ఎవరు పోతారు పోమ్మా! అని మొఖం తిప్పుకున్నారు మరి కొందరు ప్రబుద్ధులు.

ఆమెకు తెలుసు — ఆ వూళ్లో ఎవరూ తనకు సహాయం చేయరని. ఆమాత్రం చేసే వారయితే తననెందుకలా వెలేస్తారు! ఆ విషయం బిడ్డను చూసిన కొలదీ, మందు సంగతి తలచుకున్న కొలదీమనసులోకలవరం పెడుతోంది-సంఘంలో నీతి, నియమాలు, ఆచారాలు అనే బురఖాలు తగిలించుకునే ఈ పాడు ప్రజలంతా తమరు చేసే అవినీతినీ, అనాచారాలనూ కప్పిపుచ్చు

వి. శార్వరి

కునేందుకు నిరాధారులపట్ల ఈ విధంగా ప్రవర్తిస్తుంటారని ఆమెకు తెలియదు.

ఈ సంఘం అంతా కుళ్లిపోయిందనీ, ఈ ప్రజల బుర్రలకు బూజుపట్టిందనీ, న్యాయం కోసం, ధర్మం కోసం, పవిత్రాశయాలకోసం పోరాడే కొద్దిమందినీ ఈ సంఘం, సంఘీయులు, అర్వాచీన సంపన్నులు, మూఢులు, మూర్ఖులు నిందిస్తారనీ, దూషిస్తారనీ, వేరుచేస్తారని ఆమె అనుకోలేదు. అయినా సంఘం ఆమెను దూరం చేసినట్లుగా లేదు. ఈ పాడు నీచపు, తుచ్ఛపు సంఘంలో బ్రతకలేక ఆమె వైతొలగి నట్లుగా అగుపిస్తుంది. లేకపోతే ఈ నీతిపరులంతా ఆమె పైన సమ్మె చేయటం దేనికి? రాకపోకలు బంద్ చేయటం దేనికి? ఆమెనంతన్యాయంగా చూడటం దేనికి? అపాటి మానవ విజ్ఞానం లేదా ఆమెలో! ఆమాత్రం న్యాయాన్యాయాలు తెలియవా ఆమెకు! ఆ కొంచెంపాటి సాంఘిక విజ్ఞానం లేకపోయిందా ఆమెకు! తమకున్న పాటి పరిజ్ఞానం కోల్పోయిందా! తమలో ఉన్న అజ్ఞాన, సంస్కారహీన, నాగరికతారహిత ప్రజకన్న తక్కువ నోచుకుందా? ఏం చేసింది? ఏం చేస్తున్నది? ఏం చేస్తుంది? ఇదేనా ఈ సంఘీయులంతా ఆమెకు చేసిన న్యాయం! దీన్ని చూసేనా ఉపేక్షించి వూరుకున్నది ఈ సంస్కారవాదులంతా? ఏమైనట్టు ప్రపంచంలో ఎలుగెత్తి చాటే సంస్కార యోగ్యతలు గలవారంతా? వితంతు వివాహాలు కావాలని కాకిగోల చేసే ప్రబుద్ధులంతా ఏమైనట్లు? అనాథలను ఆదరించాలని ఉపన్యాసాలు దంచే ప్రముఖులంతా ఏం చేస్తున్నట్లు? సమయానికి అక్కరకురాని ఉపన్యాసాలు, నీతులు, బోధలు మానవుని బాధలు తీర్చలేనప్పుడు వుండి ఎందుకు? వుండకేందుకు?

ఏరీ? ఒక్కరూ పలకటం లేదు. ఇళ్లల్లో దాక్కున్నారో, చలికి ముణగ దీసుకుని పడుకున్నారో, చలితీర్చుకుంటున్నారో వెచ్చవెచ్చగా మరేం చేస్తున్నారోగాని ఆమె మొరనుమాత్రం ఆలకించటం లేదు.

ఆ సమయంలో ఆమెకు తాను చిన్నప్పుడు చేసిన పూజలు, జపాలు, వ్రతాలు, తపాలు జ్ఞాపకం వచ్చినయ్. ఎంతోమంది అనాథలను రక్షించిన పార్వతీ పరమేశ్వరులు యీ నిశాసమయంలో ఆకాశంలో వెండికొండనుండి విమానంలో తిరుగుతూండ కూడదూ? మరే దేవుడైనా లోక యాత్రకు బయలుదేరి వుండకూడదూ, ముక్కోటి దేవతల్లో ఏ ఒక్కరూ, కనీసం పిల్ల దేవతైనా యీవైపుగా రాకూడదూ? వస్తే తన ఏడుపు, తన బిడ్డ ఏడుపూ వినిపించి, దిగి రక్షించకూడదూ? ఏమో, ఎంతసేపటికీ ఎవరూ వస్తున్న జాడలు కనిపించలా, అసలు ప్రాణాలున్న మనుషులకే, రోజూ తనతో పాటే ప్రాణులుగా జీవిస్తూ, వసుమతిలోని వెలుగు నీడల్ని చూస్తున్న మానవ మాత్రులకే తన విషయం పట్టనప్పుడు ఎప్పుడో ఇరవై సంవత్సరాలనాడు సృష్టించి పడేసిన దేవుడికి జ్ఞాపకం వుంటుందా? పర్తిని, అసలు దేవుళ్లంటూవుండే ఉంటే మానవులకూ, వాళ్ళకూ, ఏవిధమైన సంబంధమున్నా, ఈ సమయంలో రావాలి, కానీ ఏ ఒక్కడూ రాలేదు. అందుకనే కానేపు భగవంతుణ్ణి తిట్టింది, తనవిధిని నమ్మింది, సాటి ప్రజావాహినిని సముద్రంలో కలిపింది. తనను కన్న తలిదండ్రుల్ని దూషించింది-కానీ బిడ్డ ఏడుపు మానినట్లుగా ఏం కనిపించలేదు.

ఆమె జోకొట్టడం ప్రారంభించింది. దీపం వెలిగించింది. బయటంతా చీకటిగావుంది, తెల్లగా మంచు కురుస్తోంది చలిగాలి వీస్తోంది విపరీతంగా. చలి బాగా అధికంగా వుంది. చదరలో పిల్లవాడు ఏడుస్తోనేవున్నాడు. ఆమె ఆ ఏడుపు బాధ భరించలేక "లేదు, బాబా వూరుకో, ఏడవకు-ఏంకావాన్నా-ఏడవకు మరీ చచ్చిపోతున్నాను, హాయిగా నేచచ్చిపోయినా బావుండేది. ఎందుకు బతికించాడో భగవంతుడు అర్థం కాకుండా వుంది. పాడు జన్మ, ముష్టిజన్మ, దరిద్రపుజన్మ, ఎత్తకపోయినా బావుండేది, నిజంగా ఇన్ని కష్టాలు భరించవలసివుంటే విధి ఎట్లా తప్పుతుంది. నాన్నా పడుకో, మా బాబు పడుకోవే, మందు తీసుకొస్తాను. అమ్మగా-మా నాన్నగా బచ్చోమ్మా" అంటూ మంచంమీద పడుకోబెట్టి జోకొట్టుతోంది. పిల్లవాడు కునుకు తీశాడు నెమ్మదిగా.

ఆమెకు కొంచెం తెరపైంది. కాని మనస్సులో మరీ బాధ పట్టుకుంది. మందు, పిల్లవాడి మందు సంగతేమిటి? ఎవరూ తెచ్చేట్లు కనిపించలా. ఇట్లాగే మందు లేకుండా పిల్లవాణ్ణి ఎంతకాలం

వుంచేట్లు? మందు లేకపోతే మరీ ప్రమాదిస్తుంది. ఆ సంగతి డాక్టర్ మొన్న అనగా చెప్పాడు-కానీ ఏంచేస్తుంది? అబల-నిరాధార.

పిల్లవాడి వొంటిమీద మెల్లిగా దుప్పటి కప్పింది శ్వాస పీల్చుకోటానికి వీలయ్యేట్లు. మరో వల్చటిగుడ్డ ముక్కు వరకూ చలి దూరకుండా వుండేట్లు వేసింది, పక్కనే ఒక దిండు పిల్లవాడికి ఆనించి పెట్టింది. పెట్టెలోవున్న చిల్లర డబ్బులు కొంగున ముడివేసుకుని ముందు వేపుగా కప్పుకుంది. దీపం సన్నగా తగ్గించింది. తలుపు మెల్లిగా వేసి బయట గొళ్ళెంవేసింది. త్వరత్వరగా బయలుదేరి బయటకు నడిచింది.

డొంక దాటుతూ వుంది. దూరంగా కుక్కలు మొరుగుతూవున్నయ్. ఒక్క క్షణం ఆగింది. ఈ అరుపుకు ఉలికిపడి పిల్లవాడు లేస్తాడేమోనని భయపడింది. కాని కుక్కలు ఒక్కసాని రాగంతో అరవటం ఆపినయ్. భగవంతునికి వెయ్యి నమస్కారాలు మనసులో అర్పించి తిరిగి నడక సాగించింది. త్వరగా అతిత్వరగా నడుస్తోంది దారివెంట-కాని దారిపూర్తిగా స్పష్టంగా కనిపించటంలేదు. పూర్తిగా మంచుకురుస్తుండటం వల్ల నేలపైన గడ్డి నునువెక్కి జారుతోంది. కాని ఆమె త్వరత్వరగా నడుస్తోనేవుంది. తెల్లవారే సరికి పట్టణం చేరుకోవాలి, పొద్దుపొడిచేసరికి తిరిగి యింటికి చేరుకోవాలి. ఇంత ప్రయాణం జరగాలంటే త్వరగా నడవాలి తప్పదు.

ఆమె సరిగా అన్నం తిని నాలుగు రోజులైంది. కాళ్ళు పీక్కుపోయినయ్, కళ్ళు గుంటలుపడ్డయ్. శరీరం తూలిపోతోంది. త్వరగా నడవటంవల్ల శోష వస్తూందికూడా. కాని ఎవరూ ఆమె విషయం కనుక్కోలేదు.

మంచు వానలో ఆమె గుడ్డలు తడిసినయ్, కాని ఆమెలోనుండి పొంగే వేడి నిట్టూర్పులకు, వెచ్చగా కాగుతున్న రక్తపు ఉష్ణానికి ఆమెకేమీ చలి అనిపించలేదు. గాలి బాగావిపరీతమయింది. ఖుంయ్ వీచే గాలి, కురుస్తున్న మంచు, పొడుస్తున్న గాలి, కనపడని వెలుతురు, ఏదీ ఆమెను ఎదురుకోలేక పోతున్నయ్.

చింతల తోపుగుండా దాటుతూంది. ఎవరో దూరంగా నల్లగా కదిలినట్లుగా వుంది. కొంచెం గుండె కొట్టుకుంది. ఆగింది. ఆవ్యక్తి ఎవరో కదల లేదు. మెల్లిగా వేళాడబడుతూన్న కాళ్ళదగ్గరకు చేరింది. అది కాళ్లులేని తుమ్మమొద్దు-గుండె చిక్కబట్టుకుని తిరిగీ ప్రయాణం సాగించింది. వరసగావున్న మామిడిచెట్లు క్రిందగా కాలువనే పోతూవుంది. చెట్లపైనుండి మంచు బొట్లు టప టపా రాలుతూవున్నయ్ తలపైన అప్పుడప్పుడు. దూరంగా చెట్టు తొర్రలో ఎవరో తెల్లగా కూర్చున్నట్లుగా కనిపించింది. ఆమెకు భయం వేసింది. కాని ప్రాణాలకైనా తెగించి ముందుకు నడిచింది. ఆమె ధైర్యానికి అది దిష్టి బొమ్మగా మారింది.

మామిడితోపు బాటదాటి పొలం గట్టు వెంబడి నడక సాగించింది-దూరంగా చెట్ల మీదినించి రివ్వున గాలి వీస్తోంది-మంచు ఈ వైపుకు ఆవైపుకు గాలితోబాటు కొట్టుకుపోతూ వుంది-ఆమె జొన్న చేలుగుండా కాలి నడకన పోయింది-బాటదాటి గట్టు చేరుకుంది. తెల్లగా నీళ్లు ప్రవహిస్తున్నయ్ పెద్ద కాల్వన.

బల్లకట్టు నడిగుంజకు కట్టివేయబడి వుంది. కాలవ దాటితే మరో మైలుదూరం వుంటుంది పట్టణం. త్వరగా వెళ్ళాలి. కానీ గడ వేసేవారెవరూ లేరక్కడ. అంతా రాత్రికే ఇళ్ళకు వెళ్ళి వుంటారు తన కెవరూ సహాయం చేసేది? తెల్లవారేదాకా వుండటం అసంభవం!

గడ తనే చేత్తో తీసుకుని బల్ల నీళ్లల్లోకి తోసింది. కాని గడవేయటం కుదరటంలేదు, మొదటి వూపుతో బల్ల కొంతలో తాకిపోయింది. కాని కాలవలో వేసిన గడ పైకి లాక్కోలేక పోయింది. బల్ల ముందుకు పోతూవుంది, గడ బురదలోనుండి రావటంలేదు ఎంత లాగినా. చెమటలు పోస్తున్నయ్ అంత చలిలోనూ. కాని గడ రాందే, దాంతో పెనుగులాట ప్రారంభించింది. బలవంతాన వెనక ఆధారంలేక లాగటంలో ఆ వూపుకి వెనక్కు వెల్లికిలా కాలవలో పడింది. కెవ్వున కేక వేసింది, ఆ పడటంతో పెద్ద చప్పుడయింది.

వేకువజామునే గడ వెయ్యవలసి వుంటుంది బస్తీకెళ్లే వాళ్ళకని బల్లకట్టుస్వామి రోజు లాగానే బయలుదేరాడు. ఇంకా అంతదూరం వుందనగానే ఈ మోత వినిపించింది, ఇంత పొద్దు వేళ చేపలకోసం ఎవరు వచ్చివుంటారా అని

సంశయించి, అయినా ఎందుకైనా మంచిదేనని తొరతొరగా గట్టుకు చేరాడు. కాని ఒడ్డున బల్లలేదు, అయినా ప్రక్కలకూడా వున్నట్టులేదు. వెంటనే నీళ్లల్లో దూకాడు.

*　　　*　　　*

రెండుకళ్లూ తెరిచిచూచేసరికి ఆమె ప్రక్కగా ఒక లాంతరు వెలుగుతూవుంది, స్వామి ప్రక్కనే వేడి నీళ్ళతో ఆమె ముఖం, కళ్లు తుడుస్తూ వెచ్చచేస్తున్నాడు. ఆమె తల స్వామివొళ్లో వుంది. తలెత్తి చూసే సరికి అతనెవరో పురుషుడు, తన కుపచారం చేస్తున్నాడు. "అ!" అని ఒక్కసారిగా అరిచింది.

"భయపడకమ్మా, కొంచెం విశ్రాంతితీసుకో." అంటున్నా డతను.

తనని అమ్మా అని పిలిచేవా ళ్లెవరా అని కళ్లెత్తి చూసింది. కన్నతల్లీ, తండ్రీ అమ్మా అని ప్రేమతో పిలిచే రోజులు పోయినయ్. కన్న కొడుకు జ్వరంతో జబ్బుగా వున్నాడు. ఇత నెవరో కొత్త వ్యక్తి. ఆమె అతని ముఖంలో దేనికోసమో వెతుకుతూంది.

"పడుకోమ్మా, ఫరవాలేదు."

ఆమెకు ప్రాణం జివజివ మంటోంది.

తనను ఆదరించే వ్యక్తి ప్రపంచంలో ఎవరో ఒకరు వున్నందుకు సంతోషిస్తోంది.

"ఇట్లా పండుకోమ్మా, సేదతీర్చుకో నిప్పు కాస్తూంటాను."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ప్రక్కలో ఎవరికోసమో వెదుకుతూంది, కాని వెంటనే కళ్లు చిన్నవిచేసి పమిటకొంగు వెతుక్కుంటూంది.

"ఏమిటమ్మా?" అడిగాడు తను.

"ఏమీ లేదు, నా నాయనేడీ?"

"ఎవరమ్మా, ఎవరు?"

"నా నాయన, నా కన్నతండ్రి, నా వరాల మూట ఏడీ?

"నువ్వెక్కడున్నావో తెలియదమ్మా నీకు. కొంచెంసేపు వుండి మాట్లాడుదువు కాని పండుకోమ్మా!"

"కాదు. ముందు నా తండ్రేడీ, వరాల బుజ్జేడీ, అయ్యో మందు మందు-జ్వరం-పట్టణం బల్లకట్టు కాలవ-ఏవీ ఇవన్నీ-నే నెక్కడున్నా నసలు! నే ముందు పట్టణం పోవాలి, మందు తేవాలి-నా నాయన్ని బ్రతికించుకోవాలి-నన్ను పోనీండి——" లేవబోయింది.

పట్టుకుని ఆపి "పడుకోవమ్మా, నీ బిడ్డకేం ప్రమాదంలేదు. తరవాత వెళుదువు వుండట్లా."

"లేదు. లాభంలేదు, నాబిడ్డను చూచేవాళ్ళెవరూలేరు. ఒక్కడే యింట్లో. అయ్యో ఏం చేస్తూంటాడో— గుక్కపట్టి ఏడుస్తూంటాడు గావును,తండ్రి నా యనా-వద్దు పోనీండి వెళతాను, నా నాయన వులిక్కిపడి ఏడుస్తుంటాడేమో."

"ఏం తల్లీ, నీ బిడ్డను నే తెస్తాను చెప్పు, ఎక్కడో! లేవకమ్మా, లేస్తే ప్రమాదం అందులో నీటిగండం, అదీ యిదేంగాదు మాటలతో పోవటానికి." అన్నా డతను.

ఆమె తన పిల్లవాడి ఉనికి చెప్పింది——

స్వామి బయటకు నడిచాడు వెంటనే. పది నిమిషాలకల్లా తిరిగి వచ్చాడు చేతిలో పిల్లవాడి నెత్తుకుని--తెల్లవార వస్తూంది, తూర్పున రేఖలు బారినయ్. అతను పిల్లవాడిని ఆమె చేతుల కందిచ్చాడు, ఆమె పక్కనే పండుకని వుంది. "ఇక్కడే వుండమ్మా వస్తా" అని స్వామి వెళ్ళిపోయాడు బయటకు.

పిల్లవాడి ఒంటి జ్వరపువేడికి తన చేతులు వెచ్చబడ్డయ్. బాగా జ్వరపువాసన కొట్టింది, మిసమిస లాడుతున్నాడు కుర్రాడు. అందుకనే బయటకు నడిచాడు.

సూర్యోదయం కావస్తూవుంది, వాకిటిముందు బండి నిలిచింది. ముందు స్వామి, డాక్టరు ఇద్దరూ దిగారు బండిలోంచి. స్వామి మందులపెట్టె పట్టుకుని లోపలికి డాక్టరుతో సహా ప్రవేశించాడు.

"ఏమమ్మా! ఎలావుంది?" డాక్ట రడిగాడు.

"నాకేం ఫరవాలేదు డాక్టర్. పిల్లవాడికి ఒళ్ళు కాలిపోతూవుంది, చూడండి బాబూ"అని చెప్పింది.

డాక్టర్ పిల్లవాణ్ణి పరీక్షించాడు, నోరు తెరిచి నాలిక చూచాడు, రెప్పలెత్తి కళ్లు పరీక్షించాడు, పొట్టమీద చేయివేసి చూచాడు. ఒక ఇంజెక్షనిచ్చి, ఏదో మందిచ్చాడు.

"ఏం డాక్టరుబాబూ, ఎలా వుంది అబ్బాయికి" అన్నది మాతృదేవి.

"మరేం ఫరవాలేదమ్మా, సాయంత్రానికి లేరుకుంటాడు, నువ్వు కూడా సాయంత్రందాకా ఎటూ కదలకు, విశ్రాంతి తీసుకో."

డాక్టరు మాట్లాడుతోంటే ఆమె కళ్ళు చెమ్మగిల్లినయ్. డాక్టరు స్వామితో "సాయంత్రందాకా కొంచెం జాగ్రత్తగావుంటే, మరేం ఫరవాలేదు. పిల్లవాణ్ణికొంచెం యిదిగా మాత్రం చూడాలి, వస్తా" అంటూ వెళ్ళిపోయాడు డాక్టరు.

స్వామితో ఈ మాటలంటూంటే ఆమె కళ్ళ వెంట నీరు కారింది.

ఆమెకోసం స్వామి పాలు తెచ్చి టీ కాచటం ప్రారంభించాడు. అలవాటు లేకపోవటం వల్ల అంతగా చేతకాలేదు. కాని డాక్టరు ఇయ్యమని చెప్పాడు. ఆమెకు స్వామిని చూస్తోంటే జాలివేసింది. పాపం, అతనెందుకిలా తమకోసం కష్టపడటం? అర్థంకాలేదు. మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకుంది; కానీ ప్రశ్న ప్రశ్నగానే వుండిపోయింది. అందుకెవరూ సమాధానం చెప్పలేరనుకుందేమో వూరుకుంది.

"బాబూ, నాకోసం మీకెందుకు శ్రమా, వూరుకోండి, కొంచెమాగి వెళ్లిపోతాను" అన్నదామె.

"ఆ- ఆ! అదేమిటమ్మా సాయంకాలం వరకూ లేవకు, పిల్లవాడి జ్వరం అట్లా వుంటే వెళ్తతానంటావేం, మరేం భయం లేదు."

"వెళ్ళొద్దా, బాబూ, ఇంటికి తలుపులు తీసే వుంటయ్."

"అయ వేసుకుంటాడులేమ్మా, అంత ఇదైతే నేవెళ్లి ఆయన్ని యిక్కడికే తీసుకొస్తాగా." అన్నాడు.

అలాంటి మాటలంటుంటే ఆమెకళ్ళు చాటుగా నీళ్ళుకార్చినయ్. "అంత అదృష్టం గూడానా!" అని అనగలిగింది చివరకి.

"అదేమిటమ్మా! అట్లా అంటావూ ?"

"ఏంలేదు బాబూ నా ఖర్మ."

"అట్లా అనకమ్మా, తప్పు."

ఆమె పిల్లవాణ్ణి చేతుల్లోకి తీసుకుని కళ్ళు చెమర్చింది.

స్వామి ఈ విషయం గ్రహించాడు.

* * *

మరునాడు పిల్లవాడికి కొంచెం సుళువుగానే వుంది. ఆమెకూ స్వస్థతగా వుంది. రోజూలాగానే స్వామి వంట చేసుకోబోతోంటే ఆమె అడ్డువచ్చి "నే చేస్తాలేండి, వుండండి" అంటూ ఆయన చేతిలోని పని తీసుకుంది.

"నీకెందుకు తల్లీ శ్రమ, నే చేసుకుంటాగా కొంచెం విశ్రాంతి తీసుకో." అన్నాడు.

అతని ఉదారస్వభావానికి ఆమెకాశ్చర్యం వేసింది, ఇలాంటివాళ్ళు ప్రపంచంలో అరుదు. ఎదుటి వ్యక్తిలోని బలహీనత, మెతకదనం కనికడితే వారిమీద ఎక్కడలేని చనువూ తీసుకుని అధికారం చలాయించటం మానవులకు ఒక అలవాటయింది.

ఆనాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక రేణు గోడపక్కనే పిల్లవాడి దగ్గర కూర్చుని వుంది. స్వామి మంచంమీద కూర్చుని బీడీ వెలిగించాడు. ఆమె "వెళ్తాం బాబా యిక" అన్నది నీళ్ళు నములుతూ, సిగ్గుగా.

"ఏమ్మా యిక్కడ బాగా లేదూ ?" అన్నాడు స్వామి పొగపీల్చి గాలిలోకి వదులుతూ.

"బాగుంటే మాత్రం పోక తప్పుతుందా చెప్పండి."

"అయినా నీకక్కడ నా అనేవాళ్లెవరూ లేరుగా" అన్నాడు స్వామి.

"కాదు, వెళ్లక తప్పదు. అసలే లోకం."

"అదేమిటమ్మా, ఏం అయితే, అయినా పిల్లవాణ్ణి వదల బుద్ధికావడంలేదు ఎలా పోనిచ్చేది చెప్పు."

"పోనీ పిల్లవాణ్ణి వుంచుకుంటారా ఏం" అన్నది.

"నేనంటే మాత్రం నీవెలా వుంచుతావు చెప్పూ" అన్నాడు స్వామి నవ్వుతూ.

"సరే !" నన్నదామె నవ్వుతూ.

"లోకం ఏమనుకుంటే ఏమమ్మా, నీఆపదలో నీకు కాని లోకం, లేనిలోకం, ఈనాడు అడ్డుపడుతుందా చెప్పు, అయినా ఈ యింట్లో నిన్ను కాదనేవాళ్లెవరూ లేరు—నీ యిష్టం వచ్చినట్లు వుండు" అన్నాడు స్వామి.

కొంత కాలమయిన తరువాత సంగతి. అయిదేళ్ళ పిల్లవాడు వాకిట్లో స్వామివాళ్ళో

కూర్చుని మాటలు చెబుతున్నాడు. రేణు లోపల వంటచేస్తూంది. స్వామి పిల్లవాడికి కథలు చెప్పుతున్నాడు.

"బాబూ !" అని లోలినుంచి కేక. ఎవరూ పలకలేదు, పిల్లవాడు వినిపించుకోలేదు.

"ఓ, బాబూ ! అని తిరిగి కేకవేసింది రేణు లోపలినుండి.

స్వామి మాటలాపి 'బాబూ, లోపల అమ్మ పిలుస్తోంది పోనాయనా' అన్నాడు.

పిల్లవాడు "వస్తున్నా అమ్మా" అని లోపలి పరుగెత్తుతున్నాడు.

ఇంతలో "నాన్నను స్నానం చెయ్యమను బాబూ, వంటయింది." అని రేణు తిరిగి కుఱ్ఱవాడికి ఆజ్ఞాపించింది.

కుఱ్ఱాడు "నాన్నా, ఉవ్వాయ్" అంటూ బయటకొచ్చాడు.

"లేస్తున్నా బాబూ" అంటూనే స్వామి పిల్లవాణ్ణెత్తుకుని వంటింటి వేపు నడిచాడు.

# గ్రంథాలయోద్యమం

"విధేయుడు"

నేడు దేశాన్ని పీడించే ముఖ్య సమస్యలు మూడు-తిండి, బట్ట, విద్య. ప్రపంచం అంతా ఈమూడు ముఖ్యవిషయాలగురించి సతమత మవుతోంది. ముఖ్యంగా విద్యావిధానాల్లో ఏమాత్రం చైతన్యం లేక ప్రజానీకం అజ్ఞాన దశలో పడి దరిద్రావస్థలో కొట్టుకలాడుతున్న దనుటలో అతిశయోక్తిలేదు. విద్యా విహీనత వల్ల పీడింప బడేవాడు పీడింప బడుతున్నాడు. విజ్ఞానులు అనుకునే వ్యక్తులు అజ్ఞానులను మోసంచేసి తమ స్వలాభాలకు వినియోగించుకొని సౌఖ్యపడుతున్నారు. ఈ తారతమ్య స్థితివల్లనే దేశంలో అరాచకం, అల్లకల్లోలం, అశాంతి చెలరేగి విప్లవ భూయిష్ఠమై పోతోంది. ఈ విషయము విజ్ఞానులనుకునే పెద్దలు, ఇంవరకు తిండి, బట్ట, విద్య సౌకర్యాలు, కలిగిస్తామనే ప్రభుత్వము, వెంటనే తగు శ్రద్ధ తీసుకొని సామాన్య ప్రజల్ని విద్యావంతుల్ని, విజ్ఞానవంతుల్ని చేసి అభివృద్ధి దశలోకి తీసుక రాగల్గినప్పుడే దేశ కల్యాణం చేకూరుతుంది. శాంతి వాతావరణం నెలకొంటుంది.

నేడు పల్లె గ్రామాల్లో చెప్పుకోదగినంత విద్యా సౌకర్యాలు లేవు. గ్రామ స్థితి గతులను తెలుసుకొని విజ్ఞానయుతంగా అభివృద్ధి దశలోకి తీసుకొద్దామనే విజ్ఞానులుకానరారు. కనీసం దేశ విషయాలు తెలుసుకొనుటకు వార్తాపత్రికచదువుకునే దశలో కూడా నేడు ప్రజానీకం లేదు.

ఇందుకు కొన్ని మార్గాలు—ప్రభుత్వము, ప్రజాసంస్థలు, అవలంబిస్తే బాగుంటుంది. ప్రతి గ్రామంలో సామాన్యులకు అర్థమయ్యే తేలిక భాషలో కూడుకున్న కొన్ని పుస్తకాలు, పత్రికలతో ఒక చిన్న గ్రంథాలయం స్థాపించుట, రాత్రి పాఠశాలలు నడిపించుట నేడు సామాన్య ప్రజానీకానికి చాలా అవసరం. ఈ గ్రంథాలయాలను ప్రారంభదశలో కొద్ది పుస్తకాలతో నెలకొల్పి రానురాను అభివృద్ధిదశలోకి తీసుకరావడం కావాలి. గ్రంథాలయంపై సమర్థుడైన ఒక వ్యక్తి యాజమాన్యం వహించాలి, ఆ వ్యక్తి ప్రజల ప్రేమ ఆదరాభిమానాలకు గురియై సహనశక్తితో గ్రంథాలయమును నడుపుతూ సామాన్యప్రజల్లోకి విద్యను సుళువుగా ప్రచారం చేసే వ్యక్తి అయియుండాలి. ఇది ఆంధ్రదేశ గ్రంథాలయ సమితివారు ప్రభుత్వ దృష్టికి తీసుక వచ్చి, పల్లెగ్రామాల్లో విరివిగా ఈ గ్రంథాలయ ప్రచారం సాగించాలి. ఈ ఉద్యమానికి ఆర్థికంగా ప్రభుత్వ సహకారం కొంత, గ్రామస్థుల సహకారం కొంత ఉండి సామాన్యప్రజల విజ్ఞానవంతుల చేయాలి. ప్రస్తుతం పట్టణవాసాల్లో గ్రంథాలయాలు చాలా ఉన్నవి. వాటికి విపరీతంగా డబ్బు వెచ్చిస్తున్నారు. అయినప్పటికీ పట్టణవాసాల్లో కూడా సామాన్య ప్రజలకు గ్రంథాలయాలలో పఠనానుకూల పరిస్థితి లేదు.